
మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

## వచ్చే ఎన్నికల్లో కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి:బీజేపీ రాష్ట్ర నాయకుడు చంద్రశేఖర్

**కల్వకుర్తి, మార్చి 08 ప్రభాతవార్త:** వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం బీజేపీ పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర రాష్ట్ర నాయకుడు చంద్రశేఖర్, మాజీ జాతీయ బీసీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారిలు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. మహిళా దినోత్సవం సందర్భంగా సిలిండర్ ధరను మోడీ రూ.100వలకు తగ్గించడం శుభ పరిణామమన్నారు. ఉజ్వల పథకం రూ.300ల సబ్సిడీ పథకాన్ని పొడిగించడాన్ని స్వాగతించారు. ఈ సందర్భంగా మోడీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో నిర్వహించిన రేవంత్‌రెడ్డి సమావేశంలో ప్రధాని మోడీపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ ముఖ్యమంత్రి హోదాలో మాట్లాడే భాషను మార్చుకోవాలన్నారు. ఈ నెల 12న బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్ర ఇన్‌చార్జిలు ముఖ్య నాయకుల సమావేశం ఉంటుందన్నారు. సమావేశానికి కేంద్ర హోంమంత్రి అమిత్‌షా హాజరవుతున్నారని, ప్రతి ఒక్కరు సమావేశానికి హాజరై విజయవంతం చేయాలన్నారు. ముచ్చటగా మూడోసారి కేంద్రంలో మోడీ ప్రధాని కావడం తథ్యమన్నారు. అనంతరం చంద్రశేఖర్‌కు అయోధ్య రామయ్య చిత్రపటాన్ని బహుకరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు దుర్గప్రసాద్, రాఘవేందర్‌గౌడ్, నర్సింహ్ములు, అభిలాష్‌రెడ్డి, చందు, రవిగౌడ్, సురేందర్‌గౌడ్, విజయ్, వివేకానంద తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తల్లోజు ఆచారి

## మహాశివరాత్రి వేడుకల్లో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎంపీ

**అచ్చంపేట, మార్చి08, ప్రభాతవార్త:** అచ్చంపేట నియోజకవర్గంలోని మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఉమామహేశ్వర స్వామి దేవాలయంలో నాగర్‌కర్నూల్ ఎంపీ రాములు, ప్రముఖ వ్యాపారవేత్త గున్న సంజీవరెడ్డిలు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన ఎంపీ రాములును, ప్రముఖ వ్యాపారవేత్త గున్న సంజీవరెడ్డిలను ఆలయ ఈఓ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఎంపీ రాములు, గున్న సంజీవరెడ్డిలను శాలువాలతో సన్మానించి తీర్థప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కందూర్ సుధాకర్, పలువురు నాయకులు పురుషోత్తంరెడ్డి, మంగ్యానాయక్, ఖలీల్, నాగయ్య, భీమయ్య, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.



మహాశివరాత్రి వేడుకల్లో పాల్గొన్న ఎంపీ రాములు, పలువురు నాయకులు

## జోగులాంబ అమ్మవారి సన్నిధిలో పూజలు చేసిన కలెక్టర్ దంపతులు

**అలంపూర్ మార్చి 8 ప్రభాతవార్త:** మహాశివరాత్రి, మహాకుంభాభిషేకం మహోత్సవాల సందర్భంగా శుక్రవారం బి.యం సంతోష్ దంపతులు జోగులాంబ అమ్మవారి సన్నిధిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ దంపతులకు ఆలయ ఈఓ పురేంధర్ కుమార్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి సన్నిధిలో కలెక్టర్ దంపతులచే ప్రత్యేక పూజలు చేయించారు. కార్యక్రమంలో స్థానిక తహసిల్దార్ మంజుల తదితరులు పాల్గొన్నారు.



మహా కుంభాభిషేకంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ దంపతులు

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి...

**- ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 08 ప్రభాతవార్త:** ప్రభుత్వాలు అందిస్తున్న సౌకర్యాలను మహిళలు సద్వినియోగం చేసుకొని అన్ని రంగాల్లో రాణించి ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగాలని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలను శాలువాలతో ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ఎదుగుదలకు, స్వేచ్చకు రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, గృహలక్ష్మి, గృహ జ్యోతి లాంటి ఎన్నో రకాల సదుపాయాలను అందిస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకొని మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సుమిత్ర, సింగిల్‌విండో వైస్ చైర్మన్ యాదయ్య, డైరెక్టర్ రాజ మహేందర్‌రెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డితో పాటు పలువురు నాయకులు తదితరులు ఉన్నారు.



మహిళా మణులతో ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

# డీకే అరుణకే ఓకే..?

**- మహబూబ్‌నగర్ ఎంపీ టికెట్‌పై ఉత్కంఠ**

**- నేడో, రేపో బీజేపీ అభ్యర్థుల రెండో జాబితా**

**- అరుణమ్మకే ఇస్తారంటున్న ఆమె సన్నిహితులు**



**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 8, ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి విషయంలో గత కొంత కాలంగా ఉత్కంఠ నెలకొన్నది. నాలుగు రోజుల కిందట బీజేపీ అధిష్టానం ఎంపీ అభ్యర్థుల మొదటి జాబితా ప్రకటించగా అందులో నాగర్‌కర్నూల్ అభ్యర్థిగా పోతుగంటి భరత్ పేరును ఖరారు చేయగా, మహబూబ్‌నగర్ స్థానాన్ని మాత్రం పెండింగ్‌లో పెట్టారు. అయితే కొన్ని రాజకీయ సమీకరణాల దృష్ట్యా మహబూబ్‌నగర్ అభ్యర్థిని ఫైనల్ చేయలేదని తెలిసింది. ఈ క్రమంలో మహబూబ్‌నగర్ ఎంపీ స్థానానికి బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి, రాష్ట్ర కోశాధికారి బండారి శాంతికుమార్ ముగ్గురు గట్టి పోటీలో ఉండగా అధిష్టానం మాత్రం డీకే అరుణకే మొగ్గు చూపుతున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

డీకే అరుణ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో తనదైన ముద్ర వేసుకున్నది. ఆమె పేరు తెలియని వారు ఉండరంటే అతిశయోక్తి కాదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మంత్రిగా, ఎమ్మెల్యేగా పాలమూరుకు సేవలు అందించారు. కుటుంబ నేపథ్యం కూడా రాజకీయంలో ఉండడంతో బాగా కలిసివచ్చిందని చెప్పవచ్చు. డీకే అరుణ 2004, 2009, 2014లో వరుసగా మూడు సార్లు గెలిచి హ్యాట్రిక్ విజయంతో రికార్డు సాధించారు. 2018లో అపజయం పాలైన అనంతరం కాంగ్రెస్ నుంచి 2019నుంచి బీజేపీలో చేరారు. 2020 సెప్టెంబర్ 27 నుంచి అప్పటి నుంచి ప్రస్తుతం బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలిగా కొనసాగుతున్నారు. ఇటీవల జరిగిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఆమె పోటీ చేయలేదు. ఎంపీగా పోటీ చేయాలనే అసెంబ్లీ బరిలో ఉండకుండా దూరంగా ఉన్నట్లు తెలుస్తున్నది. 2019లో మహబూబ్‌నగర్ అసెంబ్లీ నుంచి పోటీ చేసి స్వల్ప మెజార్టీతో ఓడిపోయారు. మళ్లీ అదే స్థానం నుంచి పోటీ చేసి తన సత్తా నిరూపించి కృతనిశ్చయంతో సీటు కోసం గట్టి ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. అయితే టికెట్ ఆశిస్తున్న శాంతికుమార్, జితేందర్‌రెడ్డిని ఒప్పించి అరుణమ్మకు టికెట్ ఓకే చేయాలని అధిష్టానం భావిస్తున్నట్లు తెలిసింది. ఉమ్మడి పాలమూరులోనూ పట్టున్న నేతగా పేరున్న డీకే అరుణకు టికెట్ ఇస్తే పార్టీ గెలుస్తుందని ధీమాతో అధిష్టానం కూడా ఆమె వైపే మొగ్గు చూపుతున్నట్లు పార్టీ శ్రేణులు భావిస్తున్నారు. ఏదిఏమైనా నేడో, రేపో బీజేపీ అధిష్టానం విడుదల చేసే పార్లమెంట్ అభ్యర్థుల రెండో జాబితాతో ఉత్కంఠకు తెరపడనున్నది.



## అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు

### పాల్గొన్న జిల్లా జడ్పీ చైర్మన్ సరిత ..

**గద్వాల్ ప్రతినిధి మార్చి 8 ప్రభాతవార్త:** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శుక్రవారం స్మృతి వనంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళకు జిల్లా పరిషత్ చైర్మన్ సరిత మహిళా దినోత్సవం శుభాకాంక్షలు తెలిపి వారికి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్మన్ మాట్లాడుతూ ప్రతి రంగంలో మహిళల భాగస్వామ్యాన్ని ప్రోత్సాహించడానికి, వారి హక్కుల గురించి మహిళలకు అవగాహన కల్పించడానికి అనేక కార్యక్రమాలు ప్రభుత్వం చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తిరుపతయ్య, మధుసూదన్ బాబు, నాగేందర్ యాదవ్, ఆనంద్, సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షులు మోహరావు, సభ్యులు అచ్చన్న గౌడ్, బాలకిషన్ రావు, వాకర్స్ సంఘం అధ్యక్షులు బాబురెడ్డి, రాఘవేందర్, తిమ్మప్ప, మొయిన్, మక్తర్, యూనుస్ , హన్మంతు, రాముడు, మహిళా విభాగం నాయకులు అరుణ, సభ్యులు మాధవి, మంజుల, సంధ్య రెడ్డి, రాధ, పల్లవి, తదితరులు పాల్గొన్నారు.



మహిళా దినోత్సవంలో మాట్లాడుతున్న చైర్మన్ సరిత, వాకర్స్ మహిళా నాయకులు సంధ్యరెడ్డి

# మహిళా లోకం సంబరాలు..

### ఘనంగా మహిళ దినోత్సవ వేడుకలు



చంద్ర గార్డెన్‌లో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న జిల్లా జడ్జి శ్రీదేవి



పద్మావతి కాలనీలో సంబరాలు చేసుకుంటున్న మహిళలు



జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో నర్సులను సన్మానిస్తున్న వాసవిక్లబ్ సభ్యులు



సాహితీరెడ్డిని సన్మానిస్తున్న డికె అరుణ

**మహబూబ్‌నగర్‌బ్యూరో, మార్చి 08 ప్రభాతవార్త :** మహిళా దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మహిళాలోకం సంబరాలు చేసుకున్నది. మహబూబ్‌నగర్‌లోని బిజెపి జాతీయ ఉపాధ్యక్షు రాలు డికె అరుణ నివాసంలో మహిళా నాయకుల ను ఆమె సన్మానించారు. ఈ సందర్భంగా బిజెపి మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సాహితీ రెడ్డికి శాలువా కప్పి సన్మానించారు. జడ్చర్ల పద్మా వతీ కాలనీలో మహిళలు కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. ఆటపాటలతో సరదాగా గడిపారు. జడ్చర్ల నుండి చంద్రగార్డెన్ ఫంక్షన్ హాల్‌లో మహి ళా దినోత్సవం సందర్భంగా గురువారం రాత్రి నిర్వహించిన సమావేశానికి జిల్లా జడ్జి శ్రీదేవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు.

**వాసవి మాత క్లబ్ ఆధ్వర్యంలో...** జడ్చర్ల వాసవి క్లబ్ వనితా క్లబ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో మహిళా డాక్టర్లు నర్సులను సన్మానించారు. అలాగే రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వనితాక్లబ్ అధ్యక్షురాలు రజిత, వాసవిక్లబ్ అధ్యక్షులు లగిశెట్టి చంశ్రేఖర్, సెక్రెటరీ ఎ.ప్రదీప్, మాజీ ఏఎంసి డైరెక్టర్ జిపి ప్రవీణ్, నవీన్ సభ్యులు పాల్గొన్నారు.

## భక్తులతో కిటకిటలాడిన నల్లమల లోతట్టు అటవీ ప్రాంతం భౌరాపూర్..!

**కన్నుల పండుగగా చెంచు ఆదివాసీల ఆరాధ్యదైవం..**

**ఆడపడుచు బౌరమ్మ, మల్లికార్జునస్వామి దివ్య కళ్యాణం**

**పెళ్లి పెద్దలుగా అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ, ఏఐసిసి కార్యదర్శి వంశీచంద్‌రెడ్డి దంపతులు**

**లింగాల, మార్చి 08 ప్రభాతవార్త :** మహాశివరాత్రి పర్వదినాన ఆదివాసీల ఆరాధ్యదైవం మల్లికార్జున స్వామి, చెంచుల ఆడపడుచు అయిన భైరమ్మ కళ్యాణాన్ని శుక్రవారం భౌరాపూర్‌లో అంగరంగ వైభ వంగా ప్రభుత్వ లాంఛనాలతో నిర్వ హించారు. అమ్మాయి తరపున పెళ్లి పెద్దలుగా అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ ఆయన సతీమణి అమ్రాబాద్ జడ్పీటిసి డా. చిక్కుడు అనురాధ వ్యవహరించారు. మల్లికార్జున స్వామి వారి తరపున అచల భారత కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి వంశీ చందర్‌రెడ్డి, ఆయన సతీమణి అశ్లేష పెళ్లి పెద్దలుగా పాల్గొన్నారు. అనాదిగా వస్తున్న చెంచుల ఆచారాలను కొన సాగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా అచ్చంపేట నియోజకవర్గం లింగాల మండల పరిధిలోని అటవి ప్రాంతం అయిన భౌరాపూర్‌లో మల్లికార్జునస్వామి భౌరమ్మ వార్ల దివ్య కళ్యాణాన్ని అత్యంత కన్నుల పండువగా వైభవంగా జరిపించడం జరుగుతుంది. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి చెంచు ప్రజలు సంవత్సరానికి ఒకసారి మహాశివరాత్రి పర్వదినాన భౌరాపూర్ లో జరిగే కళ్యాణ వేడుకను తిలకించడానికి తండోపతండాలుగా చెంచులు వచ్చారు. ఈసంవత్సరం సైతం రాష్ట్రంలోని నలుమూలల నుండి చెంచులతో పాటు ఇతరులు భౌరమ్మ, స్వామివారి కళ్యాణ మహోత్సవ వేడుకను తిలకించడానికి తరలివచ్చారు. భౌరాపూర్ నల్లమల అటవి ప్రాంతం భక్తులతో కిటకిటలాడింది. ఈ వేడుకను గిరిజన సంక్షేమశాఖ అధికారులు, చెంచులు కలిసి అత్యంత భక్తి శ్రద్ధలతో మల్లికార్జున భ్రమరాంబిక కళ్యాణాన్ని కన్నుల పండుగగా జరిపించారు. ఉదయాన్నే చెంచు గిరిజన మహిళలు బోనాలు ఎత్తుకొని ఊరేగింపు చేయగా ఆడ, మగ తేడా లేకుండా డప్పుళ్ల మధ్య సాంప్రదాయ నృత్యాలు చేస్తూ అత్యంత సంతోషం, భక్తి శ్రద్ధలతో మల్లికార్జునస్వామి, భౌరమ్మ విగ్రహాల ఊరేగింపు చేస్తూ ఎదుర్కోళ్లు జరిపించారు. మంచం ముగ్గులు పోసి ఇరువర్గాల గోత్రంవారు స్వామివారిని, అమ్మవారి వివాహ సమ్మతం అడిగి ఏకాభిప్రాయం తెలపగా జీలకర్ర, బెల్లం పెట్టి తలంబ్రాలు పోసి డప్పు చప్పుళ్ల తప్పెట్ల మధ్య వైభవంగా వివాహం జరిపించారు. ఈ సందర్భంగా చెంచు పెద్దలు భౌరాపూర్ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో కళ్యాణ మండపాన్ని నిర్మించాలని, కోనేరు నిర్మాణం చేపట్టాలని, చెరువు పూడికతీత పనులు, స్నానాల కట్టలు నిర్మించాలని ఎస్టీ రిజర్వేషన్లలో ఇతరులను చేర్చవద్దని చెంచులకు పూర్తిస్థాయిలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. అమ్మాయి తరపున పెళ్లి పెద్దగా వ్యవహరించిన అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ చెంచులు అడిగిన డిమాండ్లను అంగీకరిస్తున్నట్లుగా వచ్చే కళ్యాణం నాటికి శాశ్వత కళ్యాణ మండపం నిర్మాణంతో పాటు కోరిన ఇతర పనులన్ని పూర్తి చేస్తామని ఆయన ప్రకటించారు. ఈ కళ్యాణ వేడుకలో డిటిడిఓ కమలాకర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ డిఈ హేమలత, లింగాల ఎంపిడిఓ ఆంజనేయులు, డిటి రాములునాయక్, చెంచు మతపెద్దలు, నలుమూలల నుంచి వచ్చిన చెంచు ఆదివాసీ భక్తులు పాల్గొన్నారు.



భ్రమరాంబికా తరపున ఎదుర్కోలు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ దంపతులు



మల్లికార్జునస్వామి వారి తరపున ఎదుర్కోలు కార్యక్రమంలో పాల్గొన్న ఏఐసిసి కార్యదర్శి చల్లా వంశీచందర్‌రెడ్డి, ఆయన సతీమణి



భౌరాపూర్‌లో అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ, ఆయన సతీమణి డా. అనురాధ, ఏఐసిసి కార్యదర్శి చల్లా వంశీచందర్‌రెడ్డి, ఆయన సతీమణి అశ్లేష



బౌరాపూర్‌లో కళ్యాణాన్ని తిలకించడానికి వచ్చిన భక్తులు

## భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు..!

### పంచాక్షరి మంత్రంతో మారుమోగుతున్న శైవక్షేత్రాలు



పూజలు చేస్తున్న భక్తులు

**నారాయణపేట ప్రతినిధి, మార్చి 08 ప్రభాతవార్త :** మహాశివరాత్రి సందర్భంగా పట్టణంలో శైవక్షేత్రాల్లో భక్తులతో కిటకిటలాడుతూ పంచాక్షరీ మంత్రంతో క్షేత్రాలు దేవస్థానంలో భక్తులు పూజలు, అర్చనలు, అభిషేకాలతో శివనామ స్మరణతో మారుమోగాయి. అతి పురాతనమైన మల్లికార్జున దేవాలయంలో తెల్లవారుజామున 3 గం.లనుండి 6 గం.ల వరకు స్వామికి అభిషేకాలు, కుంభేశ్వర నగరేశ్వర ఉమామహేశ్వర ఆత్మ లింగేశ్వర ఈశ్వర భక్తులు తెల్లవారు జాము నుండే ఆలయాలకు క్యూ కట్టారు. దీంతోపాటు మండలంలోని వల్లభాపురంలో దత్తక్షే త్రంలో భక్తులతో కిటకిటలాడింది. గ్రామాలలో శివాలయాల్లో పూజలు అభిషేకాలు నిర్వహించారు. పట్టణంలోని మల్లికార్జున దేవాలయంలో భక్తుల దర్శనం క్రమబద్ధీకరించుటకు పోలీసులు శ్రమపడాల్సి వచ్చింది. ఈకార్యక్రమంలో మహిళలు పెద్దలు, పిల్లలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



స్వామివారి దర్శనానికి క్యూలో నిల్చున్న భక్తులు



పండ్లు కొనుగోలు చేస్తున్న దృశ్యం

**ఆకాశాన్నంటిన పళ్ల ధరలు...**

భక్తులను నిలువునా దోచుకున్న వ్యాపారస్తులు శివరాత్రి ఉపవాసం సందర్భంగా పళ్లను భుజించడంతో వ్యాపారులు సొమ్ము చేసుకున్నారు. వంద రూపాయలకు నాలుగు ఇచ్చే కొబ్బరి బొండాలు రెండు ఇచ్చారు. రూ.30 డజను అరటిపళ్లకు రూ 60. కిలో ద్రాక్ష రూ.100, యాపిల్, సంత్రాలు, సపోటా, కళింగర్, కర్బూజా రోజువారి కన్నా రెండింతలు ఎక్కువగా అమ్మి భక్తులను నిలువు దోపిడీ చేశారు.

## ఉమ్మడి జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు

**వనపర్తి టౌన్,మార్చి 8,ప్రభాతవార్త :** షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఆదిత్యమించిన సిల్వర్ జూబ్లీ క్లబ్ ఈ పోటీలకి పట్టణ మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 21 సంవత్సరాలుగా నారమ్మ నర్సిరెడ్డి శంకరమ్మల జ్ఞాపకార్థంగా షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు.సిల్వర్ జూబ్లీక్లబ్ అనేక సామాజిక కార్యక్రమాలు చేపట్టిందని అని క్రీడాలకు పెద్ద పీట వేసిందని అన్నారు.పోటీలో పాల్గొనేందుకు వచ్చిన 90 జట్లు క్రీడాకారులకు సిల్వర్ జూబ్లీ క్లబ్ ఆధ్వర్యంలో భోజనం ఏర్పాటు చేసినట్లు వారు పేర్కొన్నారు.క్రీడా పోటీల నిర్వహణను సుచ్చిరెడ్డి మోహన్ రెడ్డి నిర్వహిస్తున్నారని క్రీడాకారులకు ఎలాంటి అవసరం ఉన్న సంప్రదించాలని సూచించారు.ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు నారమ్మ కృష్ణారెడ్డి,రఘువర్ధన్ రెడ్డి,శాంత రెడ్డి అందించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు దామోదర్ రెడ్డి సంయుక్త కార్యదర్శి ఆవుల రమేష్, కోశాధికారి బాదం పాండు,ఎంసీ సభ్యులు జగదీశ్వర్ రెడ్డి,శ్రీనివాసులు,లక్ష్మీకాంతరెడ్డి,తిమ్మారెడ్డి, గుట్ట రవి,వరప్రసాద్,మన్మోహన్‌రావు,తదితరులు ఉన్నారు.



## మహిళల అందరికీ ప్రపంచ మహిళ దినోత్సవ శుభాకాంక్షలు : ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**వనపర్తి టౌన్,మార్చి 8,ప్రభాతవార్త :** ప్రపంచ మహిళ దినోత్సవ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవుడు ప్రతి జీవికి అని సమయంలో అందుబాటులో ఉండలేని అని ప్రాణులలో అద్భుతమైన అమ్మను సృష్టించి ఇచ్చాడన్నారు.ఆ అమ్మ ఒక అమ్మతనం వరమై పొందిన గొప్ప జన్మ ఆడజన్మ అని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. లోకంతో పాటు మనం అనుకున ఈ రోజు ఆ రోజు అని ఉత్సవాలు చేసుకోవడమేగాని,అసలు ప్రతిరోజూ,ప్రతి గడియ అమ్మ ప్రసాదించిన జీవితమూ మనదని,సృష్టే అమే అయినప్పుడు ఇంక అంతా ఆమెదే అవుతుందన్నారు.అమ్మ ఎన్నో రూపాలలో మన ముందు నిత్యం కనిపిస్తున్నది అన్నారు.అమ్మ బిడ్డకు జన్మనిచ్చి అక్కగా,చెల్లిగా ఒకరికి భార్యగా చేరి,ఆ ఇంటి కోడలిగా ఒదిగి వదినగా బంధువుగా కీర్తి పొంది,స్నేహంతో ప్రేమలు పంచి,మరో అమ్మను కని అమ్మ జన్మ ఎంత అద్భుతమని అది ఆడజన్మకే సాధ్యం అన్నారు.అన్నింటిలో తానేమీ తక్కువ కాదని నిరూపిస్తూ వ్యవసాయం నుండి వ్యోమగామి వరకు,ఉద్యోగం,వ్యాపారం,రాజకీయ కళారంగాలకు వేదికగా మారి సమాజాన్ని చంటిపాపగా మార్చిలాలిస్తూ,పాలిస్తున్న అమ్మలందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు వందనం అభివందనం మహిళ మణులు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు.




## దేవరకద్ర మండలం బిజేపి మైనార్టీ మోర్చా అధ్యక్షుడిగా సమీరొద్దీన్

**దేవరకద్ర,మార్చి 08,ప్రభాతవార్త:** దేవరకద్ర మండలం బిజేపి మైనార్టీ మోర్చా అధ్యక్షుడిగా మొహ్మద్ సమీరొద్దీన్‌ను నియమించారు. ఈ మేరకు సమీరొద్దీన్‌కు పార్టీ జిల్లా మైనార్టీ మోర్చా అధ్యక్షుడు మొహ్మద్ పారూఖ్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మొహ్మద్ సమీరొద్దీన్ మాట్లాడుతూ పార్టీ పటిష్ఠతకు తన వంతు కృషి చేస్తానన్నారు. తనపై పెట్టుకొన్న నమ్మకాన్ని వమ్ము చేయనన్నారు. తనకు పదవి వచ్చినందుకు పార్టీ దేవరకద్ర నియోజకవర్గ ఇంచార్జి కొండ ప్రశాంత్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు, జిల్లా మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడులకు సమీరొద్దీన్ కృతజ్ఞతలు తెలిపారు.




## ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు

**వెల్దండ,మార్చి08 ప్రభాతవార్త:** గుండాల అంబరామలింగేశ్వరస్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని భక్తులకు తాగునీటి ఎద్దడి లేకుండా ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని శుక్రవారం ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ వరప్రసాద్‌రెడ్డి ప్రారంభించి భక్తులకు తాగునీటిని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దర్శనానికి విచ్చేసిన భక్తులకు తాగునీటి ఎద్దడి లేకుండా భక్తులకు తాగునీటి వసతి ఏర్పాటు చేశామని, ఈకేంద్రాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదేవిధంగా స్వామివారిని ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ వరప్రసాద్‌రెడ్డి దర్శించుకొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీకాంత్‌రెడ్డి, రమేష్‌నాయక్, శ్రీనునాయక్, రాఘవేందర్, లాలునాయక్‌తో పాటు తదితరులు ఉన్నారు.



## ఖోఖో టీం విద్యార్థులకు నగదు బహూకరించిన బి. గోపాలం

**మక్తల్,మార్చి 08 ప్రభాతవార్త :** ఖోఖో టీం విద్యార్థులకు పి. గోపాలం నగదు బహూకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుండి 14 మహిళా ఖోఖో టీంలు పాల్గొన్నాయని గెలుపొందిన వారికి నగదు బహుమతితో పాటు మెమెంటోలను, మెడల్స్‌ను అందజేస్తామని, ఈ క్రీడలను తన సొంత ఖర్చుతో నిర్వహిస్తున్నానని ఆయన తెలిపారు. కార్యక్ర`మంలో ఏకలవ్య స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు బి.గోపాలం, కావలి ఆంజనేయులు, శివశంకర్‌రెడ్డి, పీఈ టీలు బి.రూప, సౌమ్య, స్వరూప, మీనాకుమారి, శిల్ప, బి. దీప, పుష్ప,వెంకటేష్, వరలక్ష్మి, రెహా నాబేగం, శివశంకర్, భాస్కర్, అమ్రేష్, ఎస్. రమేష్‌కుమార్, దామోదర్, 150 మంది మహిళలు,బాలికలు పాల్గొన్నారు.




## సిసి రోడ్డు పనులు ప్రారంభించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

**నారాయణపేట ప్రతినిధి,మార్చి 08 ప్రభాతవార్త :** మక్తల్ నియోజకవర్గం మాగనూరు మండలం కొల్పూర్ గ్రామంలో ఎస్సీ వాడలో సిసి రోడ్డు నిర్మాణ పనులకు రూ. 4 లక్షలతో భూమి పూజలు చేసి స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే పల్లెలే పట్టుకొమ్మలు అనే నినాదంతో పార్టీ ముందుకు కొనసాగుతుందని ప్రతి గ్రామంలో స్థానిక సమస్యల పరిష్కారం కొరకు గత పది సంవత్సరాలలో చేయని పనులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే గ్రామాలలో డ్రైనేజీలను సిసి రోడ్లను నిర్మించి పేద ప్రజలకు కావలసిన అన్ని వసతులు కల్పించడంలో కాంగ్రెస్ పార్టీ ముందుంటుదని రాబోయే ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీని ఆదరించి ఎంపి అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సిసి రోడ్డు నిర్మాణ పనుల సందర్భంగా నాయకులు అన్నారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు రాములు, శంకర్‌లింగం గౌడ్, పి. రాములు, కె. నాగప్ప, డి.నాగేంద్ర, నర్సింలు, గ్రామస్తులు మహదేవ్, వై.రంగప్ప పాల్గొన్నారు.



## తోటి మిత్రుడికి ఆర్థిక సాయం..

**ఉప్పునుంతల,మార్చి 08 ప్రభాతవార్త :** చదువుకున్నప్పుడు తరగతి గదిలో కలిసి ఉండడమే కాదు జీవితాంతం కలిసి మెలిసి ఉండాలని భావించిన మిత్రులు ఒకరికొకరు సహాయం అందించుకోవడమే తమ లక్ష్యంగా భావించిన క్లాస్‌మేంట్స్ ఆర్థిక సాయం చేసి హౌరా అనిపించుకున్నారు. మండల కేంద్రమైన ఉప్పునుంతల గ్రామ పంచాయతీ శివారు గ్రామమైన కొత్త రామ్‌నగర్ కాలనీ జానయ్య ఇటీవల గుర్తు తెలియని వాహనం ఢీకొని తీవ్రంగా గాయాలయ్యాయి. వైద్యం నిమిత్తం వెల్దండ మండల సమీపంలో ఉన్న యెన్నం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఉప్పునుంతల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004,05 సంవత్సరంలో చదువుకున్న పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు తీవ్రంగా గాయపడిన జానయ్య కుటుంబ సభ్యులకు శుక్రవారం వారికి తోచిన విధంగా సేకరించిన రూ. 22 వేల ఆర్థిక సహాయాన్ని ఆపద సమయంలో ఆదుకున్న మిత్రులకు జానయ్య కుటుంబ సభ్యులు వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఆర్థిక సాయం చేసిన వారిలో పెద్దిరెడ్డి మహేష్‌రెడ్డి, ఎల్లయ్య యాదవ్, వెంకటేష్‌గౌడ్, నరేంద్రచారి, బర్ల బాలస్వామి, చిన్న జంగయ్య, బాలయ్య, సైదులు, రాజేందర్, కురుమయ్య, చంద్రమ్మలు ఉన్నారు. ఆర్థిక సాయంతో పాటు ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులకు పూర్తి భరోసా ఇచ్చారు.



# ప్రయాణికులకు నరకంగా మారిన గద్వాల,ఐజ రహదారులు

**గద్వాల ప్రతినిధి, మార్చి 8 ప్రభాతవార్త:** గద్వాల, ఐజ, గద్వాల, ధరూర్ ప్రధాన రహదారులు గుంతలు పడి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, జడ్పిచైర్మన్, జిల్లా అధికారులు ఎవరు కూడా పట్టించుకోవడం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారులు గుంతలు పడి ఉండటంతో వాహనదారులు నరక యాతన పడుతున్నారు. కుర్వపల్లి, పెద్దపల్లి, అమరావాయి, సద్దలోనిపల్లి, తాటికుంట , బింగిదొడ్డి, స్టేజిలలో ఆర్అండ్‌బి రహదారి గోతులు పడి ఉండడంతో తరుచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. అదే విధంగా కొండపల్లి, రేవల్లి గ్రామాలకు వెళ్లాలంటే వాహనదారులు పడే నరకయాతన అంతా, ఇంతా కాదు. జిల్లా కేంద్రం గద్వాల నుంచి ఐజ సుమారు 30 కి.మీ, అదే విధంగా కొండపల్లి, రేవల్లి రహదారి అంతా ఎక్కడ చూసినా గుంతల మయంగా ఉండటంతో అటుగా ప్రయాణం చేయాలంటేనే ప్రజలు జంకుతున్నారు. ఆర్అండ్‌బి అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి గుంతల్లో కనీసం మట్టి తొలించాలని వాహనదారులు, రైతులు, అన్నారు. గత ఐదారు సంవత్సరాల నుండి ఈ రహదారులు గుంతలు పడి ఉన్న మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రజా ప్రతినిధులు, జిల్లా కలెక్టర్, అర్అండ్‌బి

### పట్టించుకోని మంత్రులు , ఎమ్మెల్యేలు, అధికారులు





గుంతలు పడి ఉన్న గద్వాల, ఐజ రహదారి

అధికారులు ఎవరు కూడా పట్టించుకోవడం లేదని రైతులు, ప్రజలు విమర్శలు చేస్తున్నారు. ఈ గుంతల రహదారులపై రోజు ప్రయాణం చేయాలంటే తల ప్రాణం తోకకు వస్తుందని ద్విచక్ర వాహనాలు నడిపే వారు అంటున్నారు. కొద్దిగా అదుపు తప్పితే ప్రాణాలు గాలిలో కలిసి పోతున్నాయని ప్రయాణికులు లబో డిబో అంటున్నారు. ఇప్పటికైనా మంత్రి జూపల్లి కృష్ణరావు, గద్వాల, అలంపూర్ ఎమ్మెల్యే లు కృష్ణ మోహన్‌రెడ్డి, విజయుడు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, జడ్పి చైర్మన్ సరిత, జిల్లా అధికారులు, స్పందించి నూతనంగా రహదారుల పనులు చేపట్టాలని ప్రజలు , రైతులు కోరుతున్నారు.

# దేవరకద్రలో ఘనంగా వాసవిమాత పల్లకిసేవ..

### - అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారు

**దేవరకద్ర,మార్చి 08 ప్రభాతవార్త:** దేవరకద్రలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం అమ్మవారి పల్లకిసేవ కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. ప్రతి శుక్రవారం అమ్మవారి పల్లకిసేవ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. అందులో భాగంగానే ఈ పవిత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రావణమాసం తొలి శుక్రవారం సందర్భంగా ఈ పూజలు నిర్వహించారు.అలాగే అమ్మవారికి అభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పల్లకిలో తీసుకొని దేవస్థానం చుట్టూ ప్రదిక్షణలు నిర్వహించారు. పురోహితుల వేధమంత్రాలు, భక్తులు హరినామశ్చరణల మధ్య ఈ సేవ ముందుకు కదిలింది. అనంతరం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు,అర్చనలు తదితర పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవిమాత అమ్మవారు భక్తులకు అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక ఆర్యవైశ్యసంఘం అధ్వర్యంలో భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు.



వాసవిమాత అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

**ఘనంగా కుంకుమార్చన..** దేవస్థానంలో శ్రీచక్రాలతో అమ్మవారికి కుంకుమార్చన పూజాకార్యక్రమాన్ని నిర్వహించారు.లలితా సహస్రనామ పారాయణం కార్యక్రమాన్ని కూడ నిర్వహించారు. పంచామతాలతో అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజ నిర్వహించారు. మహామంగళహారతి, ప్రసాదవితరణ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. దేవస్థానం కమిటీ అధ్యక్షుడు కల్వకన్నయ్యశెట్టి, మహిళాసంఘం అధ్యక్షురాలు గుద్దేటి మంజులరాణీ, జిల్లా విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు గుద్దేటి చంద్రయ్యలతో పాటు స్థానిక ఆర్యవైశ్యులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

# శౌచాలయాల కరువు..ఇబ్బందుల్లో ప్రయాణికులు..

**రేవల్లి మార్చి 8 ప్రభాతవార్త :** కొత్త మండలంగా ఏడేళ్లు గడుస్తున్న రేవల్లి బస్టాండ్‌లో శౌచాలయాలు నిర్మించలేదు. జిల్లాలోని వివిధ ప్రాంతాలలో పాటు వనపర్తి హైదరాబాద్ వెళ్లేందుకు పలు గ్రామాల నుంచి మండల కేంద్రానికి వచ్చేవారు కనీస వసతులు లోపించిన బస్టాండ్ వద్ద బస్సుల కోసంవేచి చూసేసమయంలో అవస్థలు పడుతున్నారు. బస్సు షెల్టర్లు లేని ప్రాంతాలలో ప్రధాన రహదారిపై వాహనాలకోసం ఎదురుచూసే మహిళలు, యువతులు, వృద్ధులు, మరుగుదొడ్లులేక ఇబ్బందులకు గురవుతున్నారు. తాగునీటి వసతిలేకపోవడంతో సమీపదుకాణాల్లో సీసాలు కొనుగోలు చేసి గొంతు తడుపుకోవల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



**ఇది పరిస్థితి :** కొత్తగా మండల కేంద్రం ఏర్పాటై దాదాపు గడుస్తున్న తాసిల్దార్ ఆఫీస్, ఎమ్మార్వో ఆఫీస్, ఎంపీడీవో ఆఫీస్, పోలీస్ స్టేషన్ పదుల సంఖ్యలో మండల కేంద్రానికి ప్రజలు వస్తున్నారు. కనీస వసతులు లేక త్రాగునీరు లేక ఇబ్బందులతో అనేక మంది ప్రయాణికులు ఇబ్బందులు గురవుతున్నారు.



**ఇబ్బందులు తొలగడం లేదు..** మండల కేంద్రమైన రేవల్లి బస్టాండ్ వద్ద కనీస సౌకర్యాలు లేవు మూత్ర విసర్జనకు ఆరు బయటికి వెళ్లలేక మహిళలు తీవ్ర ఇబ్బందులేదుర్కొంటున్నారు. ప్రయాణికులకు కనీస సౌకర్యాలు కల్పించాలని కోరుకుంటున్నారు.

# పోలీస్ స్టేషన్‌లో మహిళా దినోత్సవ వేడుకలు..

### మహిళలను సన్మానించిన ఎస్సై వెంకటేశ్వర్లు

**నారాయణపేటప్రతినిధి,మార్చి 08 ప్రభాతవార్త :** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నారాయణపేట సర్కిల్ పోలీస్ స్టేషన్ పరిధిలో పని చేస్తున్న మహిళా పోలీసులను పోలీస్ స్టేషన్‌లో ఎస్సై వెంకటేశ్వర్లు, రూరల్ ఎస్సై కృష్ణదేవ్‌ల ఆధ్వర్యంలో దామరగిద్ద ఎస్సై వసంత, మహిళా కానిస్టేబుల్స్ అనిత, వెంకటేశ్వరమ్మలను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో పురుషులతో సమానంగా మహిళలు కూడా అన్ని రంగాలలో సమానంగా రాణిస్తున్నారని అన్నారు. ముఖ్యంగా పోలీస్ శాఖలో పనిచేసే మహిళా అధికారులు, సిబ్బంది తమ కుటుంబాన్ని, పిల్లల్ని చూసుకుంటూ తమ తమ విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించడం ప్రశంసనీయమని అన్నారు. ఉద్యోగాలు చేసే మహిళలు తమ పిల్లల భవిష్యత్తును చక్కగా తీర్చిదిద్దుకోవడంలో ఖచ్చితమైన అవగాహన, ప్రణాళిక కలిగి ఉంటారని తెలియజేశారు. పోలీస్ శాఖలో మగవారితో సమానంగా మహిళా పోలీసులు కూడా నిరంతరం అన్ని రకాల విధులు నిర్వర్తిస్తూ ధైర్యంగా ప్రజలకు సేవ చేయడంలో ప్రత్యేక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. మహిళా పోలీసులకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఎస్సై తెలిపారు. కార్యక్రమంలో ఎఎస్సై ఆంజనేయులు, కానిస్టేబుళ్లు హనుమంతు, శివ, యాదయ్య, హోంగార్డు ఆఫీసర్లు రఘు, శ్రీనివాసులు, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.



మహిళా పోలీసులను సన్మానిస్తున్న ఎస్సై

# కన్నుల పండువగా శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి గోవిందమాంబల కళ్యాణోత్సవం

**వెల్దండ, మార్చి 08 ప్రభాతవార్త:** వెల్దండ మండల కేంద్రంలోని బ్రహ్మగిరి దేవాలయంలో శుక్రవారం శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి గోవిందమాంబల కళ్యాణోత్సవాన్ని ఆలయ అర్చకులు కన్నుల పండువగా వైభవోపేతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయాన్ని మామిడి తోరణాలు, విద్యుద్ధీపాలతో శోభయమానంగా అలంకరించి కళ్యాణోత్సవం వేదమంత్రోచ్చారణల మధ్య అంగరంగా వైభవంగా కొనసాగించారు. కళ్యాణోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దంపతులు, వెల్దండ గ్రామ మాజీ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై కళ్యాణోత్సవాన్ని తిలకించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కళ్యాణోత్సవ వేడుకలకు హాజరైన భక్తులకు నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మిర్యాల రాజయ్య పద్మ దంపతులు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దంపతులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు ఆశాదీప్‌రెడ్డి, మోతిలాల్‌నాయక్, సంజీవ్ కుమార్‌యాదవ్, జంగయ్యయాదవ్, మట్ట వెంకటయ్యగౌడ్, పెద్ది రామకృష్ణ, అన్నదానం కృష్ణయ్యచారి, మిర్యాల రాజయ్య పద్మ, అంజయ్యచారి, పాండురంగాచారి, నాగయ్యగౌడ్, రామాచారి, పుల్లయ్యతో పాటు తదితరులు ఉన్నారు.



స్వామి వారి కళ్యాణోత్స వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు, పలువురు నాయకులు

# దక్షిణ భారతంలో బిజెపికి ఒక్క ఎంపి సీటురాదు..

### సీఎంగా రేవంత్‌రెడ్డిని ఓర్వలేని బిజెపి నాయకులు.. టిపిసిసి అధికార ప్రతినిధి జహీర్ అఖ్తర్

**మహబూబ్‌నగర్ బ్యూరో,మార్చి 08 ప్రభాతవార్త :** దక్షిణ భారతదేశంలో బిజెపికి ఒక్క పార్లమెంట్ సీటు రాదని టిపిసిసి అధికార ప్రతినిధి జహీర్ అఖ్తర్ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డిని బిజెపి నాయకులు డికె అరుణ విమర్శించడం సరికాదన్నారు. 60 ఏళ్లనుంచి కాంగ్రెస్ పార్టీ జిల్లా అభివృద్ధికి ఏమి చేయలేదని డికె అరుణ చెబుతున్నారని, నేనా అభివృద్ధిని చేశానని అంటున్నారని ఈ రెండు మాటలకు పొంతన లేదన్నారు. మీరు అప్పుడు ఏ రాజకీయ పార్టీలో ఉండి జిల్లాను అభివృద్ధి చేశారో చెప్పాలన్నారు. బిఆర్ఎస్, బిజెపి పార్టీలు ఒక్కటేనని ఆరోపించారు. నల్లమల జిల్లా బిడ్డ సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నారని, కాని జిల్లా బిజెపి నాయకులు ఓర్వలేకపోతున్నారని విమర్శించారు. ప్రపంచంలోనే 28 శాతం పేదలు భారతదేశంలోనే ఉన్నారని నేషనల్ హ్యూమన్ ఇండెక్స్ ప్రకారం నివేదికలు చెబుతున్నాయన్నారు. కేంద్ర మంత్రిత్వ శాఖల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబిసిల 42 వేల పోస్టులను బ్యాక్‌లాగ్‌లో పెట్టారని ఆరోపించారు. దేశంలో బిసి కులగణన ఎందుకు చేపట్టడం లేదో ఇక్కడి బిజెపి నాయకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ పార్టీపై అవినీతి అక్రమాలు చేస్తున్నారని పదే పదే చెప్పే బిజెపి నాయకులు సిబిఐతో ఎందుకు విచారణ జరపలేదని ప్రశ్నించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపికి ప్రజలు తమ ఓటు ద్వారా బుద్ధి చెబుతారని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ మీడియా సెల్ కన్వీనర్ సిజె బెనహర్, జిల్లా ఎస్టీ విభాగం అధ్యక్షులు లింగంనాయక్, జిల్లా మహిళా కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు బెక్కరి అనిత పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జహీర్ అఖ్తర్

## పలు శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే దంపతులు



**కల్వకుర్తి, మార్చి 08 ప్రభాతవార్త:** మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శుక్రవారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దంపతులు మైసిగండి అయ్యసాగర్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహాశివరాత్రి సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా నియోజకవర్గంలోని మహిళలకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే దంపతులను ఆలయ అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. ఆయన వెంట స్థానిక నాయకులు తదితరులు ఉన్నారు.

## పల్లకి సేవతో ముగిసిన శ్రీ లక్ష్మి పద్మావతి వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు



**కల్వకుర్తి, మార్చి 08 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీలోని శ్రీ లక్ష్మిపద్మావతి వెంకటేశ్వర స్వామి ఆలయంలో గత 3 రోజులుగా అంగరంగా వైభవంగా, కన్నుల వైభవోపేతంగా వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం రాత్రి పల్లకి సేవతో ముగిశాయని దేవాలయ చైర్మన్ కల్వ మనోహర్, కమిటీ భక్త బృందం సభ్యులు పేర్కొన్నారు. పల్లకి సేవ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్వామి వారి పల్లకి సేవలో మహిళల దాండియాలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. ముగింపు సందర్భంగా వార్షికోత్సవ వేడుకలకు సహకరించిన దాతలను, దాండియా బృందాన్ని, దేవాలయ చైర్మన్, కమిటీ సభ్యులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ భక్త బృందం సభ్యులు కల్వ హరికృష్ణ, రవి, కృష్ణయ్య, సుధాకర్, దాండియా సభ్యులు తదితరులు ఉన్నారు.

## దేవాలయాలకు పోటెత్తిన భక్తులు

**ఆత్మకూర్,మార్చి 8,ప్రభాతవార్త :** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండల కేంద్రమైన ఆత్మకూరు పట్టణంతోపాటుగా మండలంలోని వివిధ గ్రామాలలో దేవాలయాలకు మహిళలు భక్తులు పోటెత్తారు శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయము చర్ల పరమేశ్వర స్వామి దేవాలయము,షిరిగి సాయిబాబా దేవాలయాలను ప్రత్యేకంగా అలకరించారు.మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మహిళలు పెద్ద ఎత్తున దేవాలయాలకు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.మహిళలతె పాటుగా పట్టణ ప్రముఖులు పలువురు దేవాలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు.

## ఘనంగా మహాశివరాత్రి పర్వదినం..



**ఉప్పునుంతల,మార్చి 08 ప్రభాతవార్త :** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం మండలంలో ఆలయాలలో ప్రత్యేక పూజలు చేపట్టారు. మండల కేంద్రమైన ఉప్పునుంత శ్రీ చెన్నకేశవ ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు జరిపారు. భక్తులు వారి వారి ఇళ్లలో వేకువజామున స్నానాలాచరించి ఆలయాల వద్దకు వెళ్లి ప్రత్యేక పూజలు జరిపించారు. రాత్రి జాగరణలు చేపట్టారు. ఆలయాల్లో సామూహిక వ్రతాలు, తిప్పాపూర్ గ్రామంలో శివపార్వతుల కళ్యాణం ఘనంగా జరిపారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మహాశివరాత్రి సందర్భంగా భక్తుల ఉపవాస దీక్షలు

**మహ్మదాబాద్,మార్చి 08 ప్రభాతవార్త :** మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంతో పాటు వెంకటరెడ్డిపల్లి, కంచనపల్లి, ముకర్లబాద్, నంచర్ల, గాదిర్యాల్ తదితర గ్రామాలలో తెల్లవారుజాము నుంచే భక్తులు ఉపవాసాలతో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామాలలో శివాలయాలు శివనామస్మరణతో మారుమోగాయి. మహ్మదాబాద్ మండల కేంద్రంలోని దేవాలయ కమిటి సభ్యులు రకరకాల పూలతో దేవాలయాన్ని ముస్తాబు చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

### పెన్షనర్ సంఘం ఆధ్వర్యంలో విశ్రాంత మహిళా ఉద్యోగికి ఘన సన్మానం



**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 08 ప్రభాతవార్త:** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం నాగర్ కర్నూల్ వారి ఆధ్వర్యంలో సీనియర్ పెన్షనర్ అయిన సావిత్రమ్మను విశ్రాంత ఉపాధ్యాయురాలును జిల్లా సంఘ జనరల్ సెక్రటరి శ్రీధర్ ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ జీవన విధానంలో స్త్రీ పాత్ర చాలా ఉత్తమమైందని, అది ప్రపంచానికి భారత్ కుటుంబ వ్యవస్థకు ఆదర్శవంతమైందన్నారు. సమాజమైన శక్తివంతంగా మారాలంటే శక్తి రూపమైన స్త్రీ యొక్క అవసరం ఎంతో ముఖ్యమని, అటువంటి మహిళలకు ప్రాధాన్యత కలిగిన దేశం కాబట్టి భారత సమాజం వేలాది సంవత్సరాలుగాచక్కగా కలుగుతుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ సిటీజన్స్ అధ్యక్షులువార్డెన్ చెన్నయ్య,మండలఅధ్యక్షులు బుసిరెడ్డి సుధాకర్‌రెడ్డి, కార్యదర్శి యుగేందర్‌రెడ్డి, వెంకటశెట్టి, బాలస్వామి, ప్రభాకర్, శ్రీనివాసులు, బాలస్వామిరావు, కృష్ణయ్య, యశోదరెడ్డి, బాలమ్మ తదితరులు ఉన్నారు.



**ఆత్మకూర్ మార్చి8 ప్రభాతవార్త:** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం రోజు మండల కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలో రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. ఈసందర్భంగా మహిళా కండక్టర్ జ్యోతి మహిళలకు మిఠాయిలు పంచుతూ మహిళా దినొత్సవ శుభాకాంక్షలు తెలిమజేశారు. సొసైటీ జిల్లా కార్యదర్శి శ్యామ్ మాట్లాడుతూ మహిళలు ఆర్ధికంతో ఆర్ధికంగా ఎదగడమే కాకుండా రాజకీయంగా కూడా ఉన్నత పదవులు అధిరోహించాలని అప్పుడే మహిళా దినోత్సవానికి సార్ధకత చేకూరుతుందని ఆయన అన్నారు. అంతర్జాతీయ హహిళా దినోత్సవం సందర్భంగాకేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టినటువంటి పథకాలను మహిళలకు అందజేసినందుకు ప్రతి ఒక్కరూ తమ వంతుగా కృషి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు మహిళలతో పాటుగా ఆత్మకూర్ కార్గో అధికారి నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

## పాములు పట్టే దొబ్బలయ్య ఇకలేడు



ఎరుకలి దొబ్బలయ్య (ఫైల్)

**వీపనగండ్ల మార్చి8 ప్రభాతవార్త:** వీపనగండ్ల మండల కేంద్రానికి చెందిన పాములు పట్టే ఎరుకలి దొబ్బలయ్య పాము కాటుకు గురై శుక్రవారం నాడు చనిపోయాడు అని కుటుంబ సభ్యులు తెలిపారు. వీపనగండ్ల గ్రామానికి చెందిన ఎరుకలి దొబ్బలయ్య పాములు పట్టడంతో నైపుణ్యత కలిగినటువంటి వ్యక్తి ఎంతటి నాగుపాము అయినా అట్లే పట్టుకొని తన నైపుణ్యాన్ని చాటే వ్యక్తి ఎవరు పిలిచినా వెంటనే వెళ్లి వారి ఇండ్లలో కానీ ఎక్కడ ఉన్నా నాగుపామును పట్టుకొని వచ్చి ఆ పాముకున్న విషాన్ని తీసి గ్రామాల్లో పామును ఆటాడించే వ్యక్తి ఇట్లాగే వారం రోజులు పట్టుకొని అటు తర్వాత అడవిలో విడిచి పెట్టేవాడు అయితే వీపనగండ్ల ఉమ్మడి మండలంతో పాటు చుట్టుపక్కల గ్రామాలలోనాగుపాముఉన్న ఇంట్లోకి వెళ్లిఎంతటి పామునైనా పట్టుకొని వచ్చేవాడు శుక్ర వారం నాడు అదేవిధంగా వేరే వారి ఇండ్లలో నాగు పాము ఉండడంతో పట్టు కోవడానికి వెళ్లి పట్టుకుంటున్న సమయంలోఆపాము తిరిగి అతనిని కాటు వేయడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లగా ఆయనను వనపర్తి హాస్పిటల్‌కు కుటుంబ సభ్యులు తరలిస్తున్న సందర్భంలో మార్గమధ్యంలోనే చనిపోయినట్లు తెలిపారు. ఈయన మృతి పట్ల పలువురు దిగ్భ్రాంతిని వ్యక్తం చేసినారు.

## పూజ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే జీఎంఆర్



**కొత్తకోట మార్చి8 ప్రభాతవార్త:** కొత్తకోట మండలం పామపురం గ్రామంలో మహాశివరాత్రి సందర్భంగా శ్రీశ్రీశ్రీ భ్రమరాంబ సమేత శ్రీ రామేశ్వర స్వామి దేవస్థానంలో దేవరకద్ర నియోజకవర్గ శాసనసభ్యులు జి.మధుసూధన్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకుని,ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కొత్తకోటలో పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామివారి దేవాలయంలో శివ పార్వతుల కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. ముందుగా ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యే దంపతులకు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు మిషక్ తదితరులు పాల్గొన్నారు.

## మాతృమూర్తులకు ఘన సన్మానం



**కొత్తకోట మార్చి 8 ప్రభాతవార్త:** సమాజంలో అనురాగం ఆప్యాయత ప్రేమలు పంచడం స్త్రీకి సొంతం అని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బొబ్బలి నిక్సన్‌కొనియాడారు. శుక్రవారం కొత్తకోట పట్టణంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సిఐటియు ఆధ్వర్యంలో మహిళలకు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మ బిడ్డను పోరాటంతోనే జన్మనిస్తుంది. పోరాట బాటలోనే విజయం సాధించి తీరుతుంది. అందుకే మహిళ మానవాళికి మహోన్నత శిభిరం అనిఅన్నారు. జాతి పురోగమనములో మహిళలే అగ్రభాగం పనిపాటలలో అతివలె అగ్ర తాంబూలం అన్నారు. మాన వాళికి సర్వమున హహిళను ప్రపంచీకరణ మార్కెట్లో పావును చూసే పనిలో సరుకుగా చేశారని అన్నారు. సినిమాలు దృశ్యమాల దుర్మార్గాల ఫలితం అమ్మలకు భద్రత లేదు పైశాచికత్వానికి అడ్డు లేదని పేర్కొన్నారు. మనిషిగా మనుగడ నిలబడాలంటే పోరాటం తప్పదు దుర్మార్గాలను ఎదిరించుతూ ధైర్యంగా నడవక తప్పదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కురుమక్క, శాంతమ్మ, ఎలిజిబెత్ అమ్మ క్రెమ్మ, జయమ్మ, సుందరమ్మ, కాంతమ్మ, శాంతమ్మ, వజ్రమ్మ, వెంకటమ్మ, భాగ్యమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు స్వయం ప్రతిపత్తిని కల్పించి ఉపాధి అవకాశాలు ఇవ్వాలి

**వనపర్తి టౌన్‌మార్చి8 ప్రభాతవార్త:** మహిళా దినోత్సవం సందర్భంగా స్త్రీలను అన్ని రంగాలలో ప్రోత్సహించిన దేశాలు అభివృద్ధి పథంలో ముందుకు కదిలాయని ప్రభుత్వాలు మహిళలకు స్వయం ప్రతిపత్తిని కల్పించి ఉపాధి అవకాశాలు ఇవ్వాలని అన్నారు. ఏ సమాజం, ఏ జాతి, ఏ సంస్కృతి స్త్రీకి సముచిత స్థానం ఇస్తుందో ఆ సమాజం, ఆ జాతి, ఆసంస్కృతి అభివృద్ధి పథంలో వుంటుందని సింగిరెడ్డి వాసంతి మాట్లాడారు. ఈ సందర్భంగా మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు ఎం.పద్మమ్మ, డి.బాగ్యమ్మ, విశ్రాంత ఉపాధ్యాయులుసింగమ్మ, భారతమ్మనుఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మహిళా నాయకురాలు ఎన్.నాగమ్మ, నందిమల్ల శారద, కౌన్సిలర్ ఉంగ్లమ్మఅలేఖ్యతిరుమల్, సాయిలీల, కవిత, జయశ్రీ, నాయకులు నందిమల్ల అశోక్, గంధం పరంజ్యోతి, ఉంగ్లమ్మ తిరుమల్, జోహెబ్, అణపటిరాము, తోట శ్రీను, సత్యం పాల్గొన్నారు.



# హరహర మహాదేవ శంభో శంకర!

- ఆలయాల్లో మారుమోగిన శివనామస్మరణం
- భక్తులచే పరమశివునికి అభిషేకాలు, అర్చనలు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి08 ప్రభాతవార్త:** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని పలు దేవాలయాల్లో శివనామస్మరణ మారుమోగింది. పాత మార్కెట్ యార్డ్‌లోని శివాలయంలో భక్తుల రద్దీ విశేషంగా మారింది. ఆలయ ప్రధాన అర్చకులు పట్నం సురేష్ శర్మ పాల్గొన్న భక్తులకు విశేషంగా రుద్రాభిషేకం అభిషేకాలు అర్చనలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. రాంనగర్ కాలనీలో గల రామాలయంలోని శివాలయంలో ఆలయ ప్రధాన అర్చకులు వరదరాజన్ అయ్యంగార్ భక్తులచే విశేషంగా అభిషేకాలు నిర్వహించారు. ఎర్రగడ్డలోని వినోభనగర్ కాలనీలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయంలో ఆలయ ప్రధానఅర్చకులు నార్వవెంకటేశ్వర శర్మ భక్తులకు అభిషేకాలు నిర్వహించారు. శివ పార్వతుల లీలాకళ్యాణోత్సవం అత్యంత భక్తి శ్రద్ధలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు వేద ఆశీర్వచనాలు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. లింగోద్భావ సమయంలో పరమశివునికి విశేషంగా పంచామృత ఫలరసామృత అభిషేకాలు, బస్మాభిషేకం, బిల్వాభిషేకం శాస్త్రోక్తంగా వేద మంత్రచ్చరణల మధ్య నిర్వహించారు. భక్తులు తెల్లవారుజాము నుంచి రాత్రి సమయం వరకు విడతల వారిగా పరమశివుడిని దర్శించుకున్నారు. ఉపవాస దీక్షలు చేపట్టారు. భక్తులు పలు దేవాలయాల్లో భజనలు నిర్వహించారు.

**చిన్నచింతకుంట, మార్చి 08 ప్రభాతవార్త:** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని స్థానిక శివాలయాల్లో భక్తుల సందడి



శ్రీరామలింగేశ్వరుని దర్శించుకునేందుకు క్యూలైన్లలో భక్తులు



ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

నెలకొంది. శుక్రవారం మహాశివరాత్రి సందర్భంగా శివలింగానికి అభిషేకాలు నిర్వహిస్తే సకల పాపాలు తొలగుతాయని భక్తుల విశ్వాసం చిన్న వడ్డెమాన్ సమీపంలో స్వయంభూ వెలసిన శ్రీ రామలింగేశ్వర ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలి రావడంతో ఆలయ ప్రాంగణమంతా భక్తులతో కిటకిటలాడింది. చుట్టుపక్కల గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులుశివలింగానికి అభిషేకాలునిర్వహించారు. శ్రీరామలింగేశ్వరుని దర్శించుకొని భక్తులు పునీతులయ్యారు. మహాశివరాత్రి పర్వదినంలో ప్రధాన ఘట్టమైన లింగోద్భవ కాలంలోలఘుఅభిషేకాలు నిర్వహించినట్లు ఆలయ పూజారి వీరేశం తెలిపారు. మహాశివరాత్రి సందర్భంగా భక్తులు ఉపవాస దీక్షలను చేపట్టి భక్తి భావంతో ఉంటారు. మరుసటి రోజు ఇష్టదైవాలకు నైవేద్యం సమర్పించి ఉపవాస దీక్షలను విరమిస్తారు. ఆయా గ్రామాల్లోని స్థానిక శివాలయాల్లో భక్తులు శివలింగానికి అభిషేకాలు నిర్వహించారు. ఆయా గ్రామాలు శివనామస్మరణతో భక్తి భావంతో మునిగాయి.

**మహ్మదాబాద్, మార్చి 08 ప్రభాతవార్త:** మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంతో పాటు వెంకటరెడ్డిపల్లి, కంచనపల్లి, ముకర్లబాద్, నంచర్ల, గాదిర్యాల్ తదితర గ్రామాలలో తెల్లవారుజాము నుంచే భక్తులు ఉపవాసాలతో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామాలలో శివాలయాలు శివనామస్మరణతో మారుమోగాయి. మహ్మదాబాద్ మండల కేంద్రంలోని దేవాలయ కమిటి సభ్యులు రకరకాల పూలతో దేవాలయాన్ని ముస్తాబు చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు



కొత్తకోట ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

లేకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**పాన్‌గల్ మార్చి8 ప్రభాతవార్త:** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఆలయాల్లో శివనాస్మరణ మారు మోగింది. మండల కేంద్రంలో పాటు కొత్తకోట, కేతేపల్లి, రేమద్దుల, శాఖాపూర్, కదిరేపాడు, తదితరగ్రామాల్లోని శివాలయంల్లో మహిళలు భక్తులు వేకువ జాము నుంచే తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు ఉపవాస దీక్షలు చేపట్టి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులుకోలాటాలు భజనలుచేస్తూ గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు మహిళలు గ్రామస్తులు పాల్గొన్నారు.



# ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

### విద్యార్థులు మంచి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలి : ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.విద్యారాణి



మహిళా దినోత్సవం సందర్భంగా గురువులకు సన్మానం

**బిజినేపల్లి, మార్చి 08 ప్రభాతవార్త:** వాకిలి నుంచి ఎవరెస్టు శిఖరం వరకు వంటగది నుంచి అంతరిక్షం వరకు ఏ రంగమైనా తెగువ, తెలివి ఆమె సొంత. తమకు తామే సాటిఅని నేటి మహిళలు నిరూపిస్తున్నారని ప్రిన్సిపల్ డా.ఎస్.విద్యారాణి అన్నారు. పాలెంలోని శ్రీవెంకటేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపల్ డా.ఎస్.విద్యారాణి మాట్లాడుతూ మహిళలు పేదరికాన్ని పట్టుదలగా తీసుకొని ఆత్మవిశ్వాసంతో ఎదురొడ్డి విజయం సాధిస్తున్నారని అన్నారు. స్త్రీని పూజించో చోట, స్త్రీని గౌరవించే చోట, స్త్రీని రక్షించబడిన చోట ప్రతిరోజు మహిళా దినోత్సవమే అని అన్నారు. భారతదేశం భిన్న సంస్కృతుల ఏకత్వమని వివిధ భాషలు మతాలు సంగీతం, నృత్యం ఆహారం కలలుఆచారాలు, వ్యవహారాలు ఒక్కో ప్రాంతంలో ఒక్కో విధంగా ఉన్నా కూడా ఏకత్వాన్ని పాటిస్తున్నామని ఇది మన పూర్వీకులు మనకు నేర్పిన సాంప్రదాయమని తెలిపారు. విద్యార్థులు సంస్కృతిని, సంప్రదాయాలను కాపాడాలని తల్లిదండ్రులు గర్వపడేలా చదువులో మంచిగా రాణించి మంచి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. కోలాహలంగా సాంప్రదాయ దినోత్సవం సాంప్రదాయ దినోత్సవంను ఉత్సాహభరిత వాతావరణంలో జరుపుకున్నారు. రోజూ ఆధునిక దుస్తుల్లో వచ్చే విద్యార్థులు, అధ్యాపకులు ఈ రోజు మాత్రం సాంప్రదాయ దుస్తులు ధరించడం జరిగింది. విద్యార్థులు చీరలు, లంగా ఓణిలు ధరించి సందడి చేశారు. అధ్యాపకులు అందరూసాంప్రదాయ బద్ధంగా ఒకే రకమైన పంచ కట్టుతో వచ్చి నృత్యాలు, ర్యాంప్ వాక్ చేసి అందరిని ఆకర్షించారు. విద్యార్థులు నృత్యాలు, పాటలతో హోరెత్తించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డా. ఎస్.విద్యారాణి, అధ్యాపక బృందం కృష్ణయ్య, నాగరాజు, సుష్మ, శివ, రామకృష్ణ, నాగలింగం, రాధాకుమారి, ప్రవళిత, రవికుమార్, రమేష్, యాదగిరి, కృష్ణ, తేజ, మనోజ్‌కుమార్, మహేశ్వర్‌జీ, అధ్యాపకేతర బృందం జి.యాదగిరి, బాలస్వామి, కురుమయ్య, నాగేష్, అక్బర్, మాసుమాలతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.



సాంప్రదాయ దుస్తుల్లో విద్యార్థులు, అధ్యాపక బృందం

# రాజ్యాంగ పరిరక్షణకై ఉద్యమిస్తాం

- సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్

**పాన్‌గల్, మార్చి 8, ప్రభాతవార్త:** రాజ్యాంగ పరిరక్షణకు ప్రజా పోరాటాలు ఉధృతం చేసి పరిరక్షించుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండి జబ్బార్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని రేమద్దుల గ్రామంలోని సిపిఎం పార్టీ కార్యాలయంలో పార్టీ కార్యాకర్తల సమావేశం పార్టీ నాయకులు భగత్ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జబ్బార్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కులం మతం ప్రాంతం ఆధారంగా ప్రజల మధ్య చీలికలు చేస్తూ పరిపాల కొనసాగిస్తున్నారని ప్రశ్నించిన వారిపై ఉప చట్టాల కింద కేసు నమోదు చేసి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని విమర్శించారు. దళితులు ముస్లింలు క్రిస్టియన్లు అంబేద్కరిస్టులు కమ్యూనిస్టులు అణగారిన వర్గాలు మహిళల పైన దాడులు దౌర్జన్యాలు అత్యాచారాలకు పాల్పడుతున్నారని అన్నారు. అధికారంలోకి వస్తే రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని ఉద్యోగాలు కల్పించకపోగా ఉన్న ఉద్యోగాలు కూడా ఊడగొట్టి ఉద్యోగులను మోసం చేశారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను బడా పెట్టుబడిదారులకు అప్పరంగా అప్పుజెప్పి ప్రైవేట్ రంగాన్ని పెంచి పోషిస్తున్నారనన్నారు. చివరికి రాజ్యాంగానికి ప్రమాదం ఉంచి ఉందని ప్రాచీన భారత మను ధర్మ శాస్త్రాన్ని తిరిగి అమలు పరిచేందుకు బిజెపిసంఘ పరివార శక్తులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. 400 సీట్లతో మేమే అధికారంలోకి వస్తున్నామని అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని దేశవ్యాప్తంగా ఇండియా కూటమిలోని భాగస్వామ్య పక్షాలు లౌకిక శక్తులు బలపడుతున్నాయని బిజెపి ప్రజా వ్యతిరేక మతతత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు విసుగు చెందారని కాబట్టి లౌకిక విలువలతో కూడిన ఇండియా కూటమిని దాన్ని భాగస్వామ్య పక్షాలను గెలిపించి భారత రాజ్యాంగాన్ని ప్రభుత్వ రంగ సంస్థలు కాపాడుకునేందుకు రాబోయే పార్లమెంటు ఎన్నికలకోసం ప్రజలందరూఎదురుచూస్తున్నారని అన్నారు. సమావేశంలో సిపిఎం పార్టీ నాయకులు ఎం వెంకటయ్య, జి.వెంకటయ్య, ఎం.ఆంజనేయులు, ఎండికాజా, వి.భాస్కర్, ఎం.బాలకృష్ణయ్య, బాలకిషన్, కిష్టయ్య, చిట్యాల రవి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎండి జబ్బార్

# లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు



**కల్వకుర్తి, మార్చి 08, ప్రభాతవార్త:** జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం కల్వకుర్తి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మిడ్జిల్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలను సందర్శించారు. క్లబ్ అధ్యక్షులు లయన్ కలిమిచెర్ల రమేష్ మాట్లాడుతూ విద్యార్థులకు జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా బాగా చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. ఒక లక్ష్యాన్ని ఎంచుకొని చదివితే ఉన్నత స్థాయికి ఎదుగతారన్నారు. అనంతరం విద్యార్థినులకు మిఠాయిలను పంచి పెట్టారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి శ్రీధర్, కోశాధికారి గోవిందు శ్రీనివాస్, మెంబర్షిప్ కమిటీ చైర్మన్ కిషన్, తర్నికల్ శ్రీనివాస్, కొండూరు కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

## ఇరుముడితో శ్రీశైలం తరలిన శివస్వాములు

**లింగాల, మార్చి 08 ప్రభాతవార్త:** శివస్వాములు ఇరుముడితో శ్రీశైలం తరలివెళ్లారు. మండల పరిధిలోని కొత్తకుంటపల్లి గ్రామంలోని శివ స్వాములు 41 రోజులుగా కఠోర దీక్షలు చేపట్టారు. నెల్లికొండపై వెలసిన శివాలయంలో నియమ నిష్టలతో పూజలు చేశారు. శుక్రవారం శివాలయంలో పడిపూజ నిర్వహించి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. గురుస్వామి పర్వతాలు ఆధ్వర్యంలో ఇరుముడి కార్యక్రమం చేపట్టారు. అనంతరం శివస్వాములు శివాలయం నుంచి పురవీధుల గుండా వచ్చి శ్రీఆంజనేయస్వామి వారినిదర్శించుకున్నారు. శ్రీశైలం మల్లన్న సన్నిధికి తరలివెళ్లారు. అంతకు ముందు భక్తులకు అన్నదానం చేశారు. భక్తుల రాకతోశివాలయం కిటకిటలాడింది. శివస్వాములు, శ్రీనివాసులు, వెంకటయ్య, రాజీవ్, అభి, ఆంజనేయులు పాల్గొన్నారు.



## పూజ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే



**బిజినేపల్లి, మార్చి 08 ప్రభాతవార్త :** శివయ్యకు భక్తులంటే ప్రీతి. భక్తులకు శివుడంటే నమ్మకం. అందుకే భక్తులు మహాదేవుడిని రోజూ స్తుతిస్తూ నిత్య శివరాత్రి జరుపుకొంటారని ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. బుద్దారం గండిలో రామలింగేశ్వరస్వామి, ఆంజనేయస్వామి ఆలయాలను దర్శించుకున్నారు. వేద బ్రాహ్మణులుపూర్ణకుంభంతోస్వాగతం పలికి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యేకు ఆశీర్వచనాలు అందించారు. ఆలయ నిర్మాత తూమ్‌నరోత్తంరెడ్డి సేవలను గుర్తు తెచ్చుకున్నారు. కార్యక్రమంలో బిజినేపల్లి జడ్పీటిసి హరిచరణ్‌రెడ్డి, వెంకటస్వామి, మాన్యనాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


## ప్రారంభమైన శ్రీమహాలక్ష్మి యాగం



మహాలక్ష్మి యాగాన్ని జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న దృశ్యం

**కల్వకుర్తి, మార్చి08 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలోని కేసీఆర్ ఫంక్షన్‌హాల్ మహాలక్ష్మి యాగ కమిటీ ఆధ్వర్యంలో మహాలక్ష్మి యాగ కార్యక్రమాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. సోమిశెట్టి నాగరాజు స్వామి ఆధ్వర్యంలో యాగం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కన్యకాపరమేశ్వరి దేవాలయ చైర్మన్ జూలూరి రమేష బాబు, మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్‌లు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసికార్యక్రమాన్ని ప్రారంభించారు. యాగం చేసే ప్రాంగణంలో న్యాట నివేధన ప్రవచనాలు, శివరాత్రి సందర్భంగా జాగరణం సందర్భంగా ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్న యాగ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రాంగణంలో లక్ష్మినరసింహ స్వామి, లక్ష్మిదేవి, సుదర్శన్ చక్ర బొమ్మలు వేశారు. అదే పురోహితులు యాగ పూజ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యులు, యాగ కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

## శ్రీశైల మల్లిఖార్జున సన్నిధిలో మహా రుద్రాభిషేకం



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 08 ప్రభాతవార్త:** మహాశివరాత్రి పర్వదిన వేడుకలను శ్రీశైల మల్లిఖార్జున సన్నిధిలో మల్లిఖార్జున అన్న సత్ర సంఘం ఆధ్వర్యంలో అత్యంత వైభవోపేతంగా కన్నుల పండువగా నిర్వహించారు. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకని మల్లిఖార్జున అన్న సత్ర సంఘం అధ్యక్షులు మిడిదొడ్డి శ్యాంసుందర్ ఆధ్వర్యంలో మహారుద్రాభిషేకం, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. గత మూడు రోజులుగా మల్లిఖార్జున దర్శనానికి విచ్చేసిన భక్తులకు మల్లిఖార్జున అన్న సత్ర సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ జిల్లా ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు బచ్చురామకృష్ణ, సంఘంసభ్యులు ఆంజనేయులు, బిల్లకంటి రవికుమార్, మిడిదొడ్డి చంద్రశేఖర్; ఉప్పల సూర్యం, శ్రీనివాస్‌గౌడ్, మిడిదొడ్డి నవీన్, తాడూర్ శ్యాంసుందర్, సరస్వతి, జ్యోతి, శ్రీలత, బచ్చు దీపక్, బచ్చు చంద్రిక తదితరులు ఉన్నారు.

## గ్రామ ప్రజలకు మంచినీటి సౌకర్యం



బోరు మోటార్‌ను ప్రారంభిస్తున్న కాయితీ ఆశాదీప్‌రెడ్డి

**కల్వకుర్తిరూరల్, మార్చి 08 ప్రభాతవార్త:** పుట్టిన గ్రామానికి ఏదో ఒక సేవా చేయాలనే సంకల్పంతో తన స్వంత నిధులు వెచ్చించి గ్రామాభివృద్ధికి ముందుకొచ్చారు కాంగ్రెస్ యువ నాయకులు ఆశాదీప్‌రెడ్డి. కల్వకుర్తి మండలం తాండ్ర గ్రామంలో 6వ వార్డులో ప్రజలు మంచినీటి కోసం ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తెలుసుకున్న ఆశాదీప్‌రెడ్డి గత వారం క్రితం బోర్ డ్రిల్లింగ్ పనులు చేపట్టారు. శుక్రవారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని నూతన వాటర్ మోటార్‌ను ఆశాదీప్‌రెడ్డి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ప్రజలకు ఎప్పుడు ఎలాంటి సమస్యలు వచ్చిన తాను ముందుండి పరిష్కరిస్తానన్నారు కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

## గద్వాల సీఐగా బాధ్యతలు చేపట్టిన భీమ్ కుమార్

**గద్వాల మార్చి8 ప్రభాతవార్త :** గద్వాల పట్టణ సీఐగా భీమ్ కుమార్ శుక్రవారం బాద్యతలు చేపట్టారు. ఇక్కడ సీఐగా పనిచేస్తున్న టాటా బాబు బదిలీ కావడంతో ఆయన స్థానంలో భీమ్ కుమార్ బదిలీపై ఇక్కడికి వచ్చారు.



# సమాజ సేవ ఆయన దినచర్య

- పేద విద్యార్థులకు చదువుకు ఆర్థిక సహాయం, ప్రోత్సాహకాలు
- సామాజిక సేవలో తనదైన శైలిలో ముద్ర ..
- శ్రీవీర వెంకట సత్యనారాయణ స్వామి ఛారిట్రబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాల దిశగా అడుగులు

... ఓ జర్నలిస్టుగా జీవితాన్ని ప్రారంభించి తాను కష్టాన్ని నమ్ముకుని రియల్ ఎస్టేట్ రంగంలో ఎన్నో ఒడిదిడుకులు ఎదురుకుని అంచెలంచెలుగా ఎదుగుతూ ఉన్నత స్థానాలకు చేరుకున్న తరుణంలో సమాజ సేవ చేయాలన్న దృఢ సంకల్పంతో శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామి ఛారిట్రబుల్ ట్రస్ట్ అధినేత తిరుమల మహేష్ పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ పలువురికి ఆదర్శంగా నిలస్తున్నారు.



ప్రైవేట్ ఉపాధ్యాయురాలుకు ఆర్థిక సహాయంను అందజేస్తున్న తిరుమల మహేష్ ( ఫైల్)

**వనపర్తి ప్రతినిథి, మార్చి 08, ప్రభాతవార్త :** మధ్య తరగతి కుటుంబంలో జన్మించి ఎన్నో ఒడిదిడుకులను ఎదురుకుని అపజయాలను విజయాలుగా మార్చుకుంటూ ఒక్కో మెట్టు ఎదుగుతూ ఒక్కో మెట్టు ఎదగడానికి పడిన కష్టాన్ని విస్మరించకుండా ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలన్న పదానికి నిర్వచనంగా ఉన్నత స్థానంలో ఉన్నప్పటికి సమాజంలో ఎంతో మందికి నేనున్నాంటూ భరోసాను ఇస్తూ కష్టసుఖాల్లో వారిగా ఉండటమే కాకుండా శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామి ఛారిట్రబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ పలువురి చేత తిరుమల మహేష్ శభాష్ అనిపించుకుంటూ ఆదర్శంగా నిలుస్తున్నాడు.

**శ్రీ వీర వెంకట సత్యనారాయణ ఛారిట్రబుల్ ట్రస్ట్ ప్రారంభం ఇలా ....**
రూపాయి సహాయం చేసి వంద రూపాయల పబ్లిసిటి కోరుకునే రోజుల్లో కూడా ఎంతో మందికి ఇటు సహాయం, అటు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ తన పనిని తాను చేసుకుంటూ ముందుకు సాగుతున్నాడు. తాను ఎన్నో కష్ట నష్టాలను చవి చూసిన స్వశక్తితో ఉన్నత స్థానానికి ఎదిగి పది మందికి ఉపాధిని కల్పిస్తూ తనకు ఉన్న దానిలో తన వంతుగా సమాజానికి ఉపయోగపడాలన్న ఆలోచనల నుండి వచ్చిందే శ్రీ వీరవెంకట సత్యనారాయణ ఛారిట్రబుల్ ట్రస్ట్. 2016 సంవత్సరంలో ఈ ట్రస్ట్‌ను వనపర్తి జిల్లా కేంద్రానికి చెందిన తిరుమల సరస్వతి డెవలఫర్ మేనేజింగ్ డైరెక్టర్ తిరుమల మహేష్ స్థాపించారు. ప్రారంభం నాటి నుండి నేటి వరకు పలు సామాజికకార్యక్రమాలు, ఆలయాల అభివృద్ధికి , పేదింటి ఆడబిడ్డలకు పుస్తె ,మెట్టెలు, క్రీడాకారులకు పలు క్రీడా ఫోటీలు, ప్రోత్సహకాలు, ఇలా ఎన్నో కార్యక్రమాలను నిర్వహిస్తూ పలువురికి ఆదర్శంగా నిలస్తున్నారు.




క్రీడాకారులకు ట్రోఫిని అందజేస్తున్న తిరుమల మహేష్ ( ఫైల్‌ఫోటో)

**ట్రస్ట్ ఆధ్వర్యంలో చేసిన సేవా కార్యక్రమాల వివరాలు ....**
... 2019 సంవత్సరంలో జిల్లా కేంద్రంలో రూ 1లక్ష 86వేలతో 25 సీసీ కెమారాల ఏర్పాటు

- 2019 జిల్లా కేంద్రంలోని తిరుమల హిల్స్ దగ్గర ట్రస్ట్ ఆధ్వర్యంలో 15 రకాల వైద్య నిపుణులతో దాదాపు 500 మందికి స్వంత ఖర్చులతో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి వైద్యాన్ని అందించారు.
- కరోనా సమయంలో రూ 1లక్ష రూపాయల చెక్కును అందజేత
- జిల్లా కేంద్రంతో పాటు పెద్దమందడి మండలంకు చెందిన నిరుపేద ఆడబిడ్డల పెండ్లిలకు తన వంతుగా రూ 10వేలు విలువ గల పుస్తె మెట్టెలు పంపిణి
- క్రీడాకారులను ప్రోత్సహించే విధంగా 2020లో జిల్లా కేంద్రంలో నిర్వహించిన హాకి టౌర్నమెంట్ అసోసియేషన్‌కు తన వంతుగా హాకి క్రీడాకాలకు హాకికిట్స్, 2021లో సింగిరెడ్డితారకమ్మ స్మార్థకార్థం నిర్వహించిన క్రికెట్ ఫోటీల్లో క్రీడాకారులకు భోజన వసతితో పాటు మొదటి బహుమతి సాధించిన టీంకు రూ 50వేల నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు.
- 2020 లో త్యాగరాయ నాయి బ్రాహ్మణ సంఘం ఉత్సవాలకు రూ లక్ష ఆర్థిక సహాయం
- 2016లో ఆత్మకూర్ మండలం ఆరేపల్లి గ్రామంలో గల వెంకటేశ్వర స్వామి ఆలయం నిర్మాణం కోసం రూ 51వేలు, జిల్లా కేంద్రంలోని గాంధీ నగర్‌లో గల శ్రీ అభయ ఆంజనేయస్వామి ఆలయం గ్రిల్స్‌కు రూ లక్ష, గోపాల్‌పేటమండలం పొల్కెపహాడుశివాలయ అభివృద్ధికిరూలక్ష, నాగవరంలోగలగోశాల అభివృద్ధికి రూ 50వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు.
- కరోనా సమయంలో పట్టణ, రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో విధులను నిర్వహిస్తున్న100 మందిసిబ్బంది దాదాపు 15 రోజుల పాటు భోజన వసతి
- వనపర్తి మండలం చిమనగుంటపల్లి గ్రామంలో రామాలయం ఆలయ నిర్మాణానికి రూ3లక్షలు,అంకూర్ గ్రామంలో హనుమాన్ దేవాలయ నిర్మాణానికి రూ 50వేలు,
- 2024 లో గద్వాల జిల్లా బీచుపల్లి 10వ బెటాలియన్ దగ్గర కనకదుర్గ అమ్మవారి ధ్వజస్థంభం ప్రతిష్టాపన కోసం రూ లక్ష 50వేలను అందించారు.

**సమాజంలో నలుగురికి సహాయం అందించడంలో ఉన్న ఆనందం ఎక్కడా దొరకదు ....**



కష్టాలో ఉన్న వారికి తన వంతుగా ఉన్నంతలో సహాయం అందించడంలో ఉన్న ఆనందం ఎక్కడా వెతికినా ఎక్కడికివెళ్లినా దొరకదు. అందుకే పక్కవారికి సహాయం చేయడంలో ఆనందాన్ని వెతుకుంటున్నా. ప్రజలకు తన వంతుగా సేవా చేయాలన్న లక్ష్యంతోనే శ్రీ వీర వెంకట సత్యనారాయణ ఛారిట్రబుల్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ ట్రస్ట్ ఆధ్వర్యంలో పలు సామాజిక, సేవా కార్యక్రమాలు, ఆలయాల అభివృద్ధి కోసం కృషి చేస్తున్న. ట్రస్ట్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలను చేయడానికి ఎల్లప్పుడు ముందు వరుసలో ఉంటాం.

**తిరుమల మహేష్, శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి ఛారిట్టబుల్ ట్రస్ట్ అధినేత**

## మహిళా ఉద్యోగికి సన్మానం

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 08 ప్రభాతవార్త:** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం నాగర్ కర్నూల్ వారి ఆధ్వర్యంలో సీనియర్ పెన్షనర్ అయిన సావిత్రమ్మను విశ్రాంత ఉపాధ్యాయురాలును జిల్లా సంఘ జనరల్ సెక్రటరి శ్రీధర్ ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయజీవన విధానంలో స్త్రీ పాత్ర చాలా ఉత్తమమైందన్నారు. కార్యక్రమంలో సీనియర్ సిటీజన్స్ అధ్యక్షులువార్డెన్ చెన్నయ్య, మండలఅధ్యక్షులు బుసిరెడ్డి సుధాకర్‌రెడ్డి, కార్య దర్శి యుగేందర్‌రెడ్డి, వెంకట్‌శెట్టి, బాలస్వామి, ప్రభాకర్, శ్రీనివాసులు, బాల స్వామిరావు, కృష్ణయ్య, యశోదరెడ్డి, బాలమ్మ ఉన్నారు.

## సిఐగా బాధ్యతలు చేపట్టిన అప్పయ్య



**మహబూబ్‌నగర్, మార్చి08 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ మొదటి పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ స్టేషన్ హౌసింగ్ ఆఫీసర్ అధికారిగా అప్పయ్య బాధ్య తలు చేపట్టారు. అప్పయ్య ఇక్కడే గతంలో ఎస్సైగా పనిచేసే ప్రస్తుతం సిఐగా శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతిఒక్కరు సహకరించాలని కోరారు.

# కన్నుల పండువగా మహాశివరాత్రి వేడుకలు

- శివనామస్మరణతో మారుమోగిన ఆలయాలు
- గుండాల అంబరామలింగేశ్వర స్వామి దేవాలయానికి పోటెత్తిన భక్తులు
- ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దంపతులు

**వెల్దండ, మార్చి 08 ప్రభాతవార్త:** వెల్దండ మండల పరిధిలో శుక్రవారం మహాశివరాత్రి పర్వదిన వేడుకలను భక్తులు అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. గుండాల అంబరామలింగేశ్వరస్వామి దేవాలయంతో పాటు పలు గ్రామాల్లోని ఆలయాలను విద్యుద్ధీపాలతో అందంగా ముస్తాబు చేశారు. హిందు సంప్రదాయంలో మహాశివరాత్రి అత్యంత పవిత్రమైన రోజుగా పరిగణిస్తారు. శివలింగం ఉద్భవించిందని ప్రతీతి. సాక్ష్యాత్తు గంగాదేవిని శిరస్సును ధరించిన మంగళ స్వరూపుడు పరమ శివుడు. ఆ స్వామికి పరమపవిత్రమైన జలాలతో అభిషేకం చేస్తారు. సముద్ర జలాలు, పుష్కర జలాల్లో స్నానం చేస్తే లభించేంత పుణ్యఫలం పరమేశ్వరుడికి అభిషేకం చేస్తే అంతే పుణ్యఫలం లభిస్తుందన్నారు. పరమ పవిత్రమైన మాసంలో చిట్టచివరి పండుగ మహాశివరాత్రి. పర్వదిన వేడుకలు అంబరామలింగేశ్వరస్వామి దేవాలయంలోఉత్సవాలుఅంబరాన్ని అంటాయి. తెల్లవారుజాము నుంచే పరమశివుని అనుగ్రహంపొందాలని, దైవదర్శనం, అభిషేకాలను భక్తులు ఘనంగా నిర్వహించారు. అంబరామలింగేశ్వరస్వామి దేవాలయంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దంపతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు వెల్దండ గ్రామ మాజీ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి, కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్‌లను ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. శివాలయంలో అర్చకులు ఎమె మ్మెల్యే దంపతులు, యెన్నం భూపతిరెడ్డి, బృంగి ఆనంద్‌కుమార్‌లు శివలింగంకుఅభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలకు విచ్చేసిన



ఆలయానికి పోటెత్తిన భక్తులు



ఉత్సవాలకు హాజరైన ఎమ్మెల్యే దంపతులకు పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న దృశ్యం

ప్రముకులను ఆలయ అర్చకులు, నిర్వాహకులు పూలమాలలు, శాలువాలతో ఘనంగాసన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారికి కూత వేటు దూరంలో ఉన్న అంబరామలింగేశ్వరస్వామి దేవాలయం దినదినాభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. సప్త గుండాలు కలిగి నిరంతరం అభివృద్ధి దిశగా పయాణిస్తుంది. గ్రామాల్లోని పురాతన దేవాలయాలకు దూప, దీప నైవేద్యాలతోపాటు అర్చకులకు వేతనాలు అందిస్తున్నారన్నారు. దేవాలయాల అభివృద్ధిలో ప్రభుత్వం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. గుండాల అంబరామలింగేశ్వరస్వామి దేవాదాయ శాఖ నుంచి అత్యధిక నిధులు కేటాయించి దేవాలయాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తామన్నారు. జియాగూడ యాదవసంఘం అధ్యక్షులుజక్కుల జంగయ్యాయాదవ్, మండలి మహేష్ యాదవ్‌లు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని భూపతిరెడ్డి, ఆనంద్‌కుమార్, సంజీవ్‌కుమార్ యాదవ్‌లు ప్రారంభించారు. ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, తలకొండపల్లి జెడ్పీటీసీ ఉప్పల వెంకటేష్ స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉప్పల వెంకటేష్ ఆధ్వర్యంలో భక్తుల దాహార్తిని తీర్చడానికి వాటర్ బాటిల్స్‌ను బహుకరించారు. సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్ఐ రవిల ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో చైర్మన్ సందీప్‌రెడ్డి, మాజీ ఎంపీపీ జయప్రకాష్, నాయకులు అశోక్‌రెడ్డి, పర్వత్‌రెడ్డి, మోతిలాల్‌నాయక్, మట్ట వెంకటయ్యాగౌడ్, పుల్లయ్య, పెద్ది రామకృష్ణ, కృష్ణ ముదిరాజ్, వెంకటమ్మ, గోళిసురేందర్‌రెడ్డి, ఆలయఈఓప్రసాద్, కమిటీ సభ్యులు అంజయ్య, ఆలయ అర్చకులు బాలస్వామి శర్మ, కృష్ణయ్యాశర్మ, శివప్రసాద్‌శర్మ, సంతోష్‌శర్మ, నరహరిశర్మ, సురేష్‌శర్మతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగులపై హరీష్‌రావు వ్యాఖ్యలు ఆక్షేపనీయం : టిఎస్ యుటిఎఫ్

**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 08 ప్రభాతవార్త:** ఉద్యోగులు జీతాల బూచి చూపి, రైతులను రెచ్చగొట్టేటట్లు మాజీ మంత్రి హరీష్‌రావు రైతుబంధు డబ్బులు ఆపి ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తారా? అంటూ చేసిన వ్యాఖ్యలు ఆక్షేపణీయమని తీవ్ర అభ్యంతరకరం అని ఈ వ్యాఖ్యలను ఖండిస్తున్నామని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టిఎస్ యుటిఎఫ్) మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షులు ఎన్. వెంకటేష్, ప్రధాన కార్యదర్శి రవికుమార్ అన్నారు. టిఎస్ యుటి ఎఫ్ మహబూబ్‌నగర్ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం శుక్రవారం టిఎస్ యుటిఎఫ్ కార్యాలయంలో నిర్వహించారు. సమావేశాన్ని ఉద్దేశించి టిఎస్ వారు మాట్లాడుతూ ఉద్యోగులు నెలరోజుల పాటు పనిచేసిన తర్వాత నెల మొదటి తేదీన వేతనాలు పొందడం ఉద్యోగుల హక్కు అని, తెలంగాణ ప్రభుత్వం 2019 నుండి ఉద్యోగులకు ప్రతినెల మొదటి తేదీన వేతనాలు చెల్లించకుండా 15వ తేదీ వరకు వేతనాలు చెల్లించడం గత ప్రభుత్వం చేసిన ఘోర తప్పిదమన్నారు. నూతనంగా ఏర్పాటైన ప్రభుత్వం మార్చి నెలలో మొదటి తేదీన వేతనాలు చెల్లించినందుకు ప్రతిపక్షంగా అభినందించాల్సింది పోయి ఉద్యోగులకు రైతులకు మధ్య తగాదా సృష్టించేటట్లుగా హరీష్‌రావు వ్యా ఖ్యలు చేయడం శోచనీయమన్నారు. గతంలో ఆయన ఆర్థిక మంత్రిగా ఉన్నప్పుడు ఉద్యోగుల వేతనాలు, పెండింగ్ బిల్లులు ఏరియర్స్ తదితర బకాయిలను వెంటనే విడుదల చేయాలని అనేకసార్లు టిఎస్ యుటిఎఫ్ హరీష్‌రావుకు విన్నవించిన పరిష్కరించకపోగా, పెండింగ్‌బిల్లులు నేటికి ఈ కుబేర్లో పేరుకుపోయి ఉద్యోగులకు అందలేదని అన్నారు. సిపిఎస్ ఉద్యోగ ఉపాధ్యాయులకు డిఎ బకాయిలు, పీఆర్సీ బకాయిలు గత ప్రభుత్వంలో పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఉద్యోగ, ఉపాధ్యయులు అనేక పోరాటాలు, ఉద్యమాలు చేసి సకల జనుల సమ్మెలో కీలక పాత్ర పోషించి తెలంగాణ సాధనలో తమవంతు పాత్ర నిర్వహించిన ఉద్యోగుల జీతాల పట్ల ఇలాంటి వ్యాఖ్యలు చేయడం శోచనీయమని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉద్యోగుల పెండింగ్ డీఎలను విడుదల చేయాలని, ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియను చేపట్టాలని, వేసవి సెలవుల్లో ఉపాధ్యాయుల బదిలీలు నిర్వహించాలని, ఈ కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్నఅన్ని రకాల బకాయి బిల్లులను విడుదల చేయాలని టిఎస్ యుటి ఎఫ్ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం తీర్మాణించింది. మార్చి 9,10లో హైదరాబాదులో జరుగుతున్న రాష్ట్రవిస్తృత సమావేశాలను విజయవంతం చేయాలని టిఎస్ యుటిఎఫ్ పిలుపునిచ్చింది. సమావేశంలో టిఎస్ యుటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు పి. ఉమాదేవి, జిల్లా కోశాధికారి వి. భాస్కర్, జిల్లా కార్యదర్శులు అజయ్, కిష్ట్యానాయక్, హేమంత్‌కుమార్, మన్యం కృష్ణయ్య, జిల్లా ఆడిట్ కమిటి కన్వీనర్ శివరాజ్‌గౌడ్, రాష్ట్ర కమిటి సభ్యురాలు సృజన పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న టిఎస్ యుటిఎఫ్ నాయకులు

# ప్రజా పోరాటాలకు మార్గదర్శి కామ్రేడ్ కిష్టన్న

- సిపిఎం మండల కార్యదర్శి బి.శివవర్మ

**కొల్లాపూర్, మార్చి 08 ప్రభాతవార్త:** మండల పరిధిలోని సింగోటం గ్రామ మాజీ సర్పంచ్ కామ్రెడ్ కిష్టన్న సిపిఎం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మొదటి కార్యదర్శిగా పని చేసిన కామ్రెడ్ కె. కిష్టన్న ఆశయాలను కొనసాగిస్తామని సిపిఎం మండల కార్యదర్శి బి. శివవర్మ అన్నారు. శుక్రవారం కొల్లాపూర్ మండల సిపిఎం పార్టీ కార్యాలయంలో కె. కిష్టన్న 18వ వర్థంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి బి. శివవర్మ మాట్లాడుతూ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు సిపిఎం పార్టీ కార్యదర్శిగా దాదాపు20 సంవత్సరాలుగా పని చేశారని, అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పోరాటాలను అణిచివేసేందుకు 20నెలల పాటు రాజమండ్రి జైల్లోకామ్రెడ్ కిష్టన్నను బంధించారని అన్నారు. 20 సంవత్సరాల పాటు కొల్లాపూర్ మండలం సింగోటం గ్రామానికి సర్పంచ్‌గా పని చేసి ఏ ఒక్క అవినీతి మరక లేకుండా నిలిచిన నాయకుడని, అప్పట్లోనే 75 వేల రూపాయల మిగులుబడ్జెట్ ఉన్న గ్రామపంచాయతీగా సింగోటాన్ని తీర్చిదిద్దాడని అన్నారు. ఉపాధ్యాయ రంగ అభివృద్ధి కోసం, జిల్లాలో కరువులు వచ్చినప్పుడు అంబలి కేంద్రాల నిర్వహణలో కీలక పాత్ర పోషించారని అన్నారు. అప్పటి నక్సలైట్లు అనేక రకాలుగా బెదిరించిన తన ప్రాణం పోయినా పార్టీ జెండాను వదిలేది లేదని వారికి తేల్చి చెప్పారని అన్నారు. అనేక ఒడిదుడుకులు వచ్చిన పార్టీ కొరకు చివరి వరకు కొనసాగాడని అన్నారు. ఆయన ఆశయ సాధనకు మండలంలో సిపిఎం పని చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎం. తారాసింగ్, మధు, సురెందర్, సతీష్, మహేష్ పాల్గొన్నారు.



కామ్రెడ్ కిష్టన్నకు నివాళులర్పిస్తున్న దృశ్యం

## మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థిగా చల్లా వంశీచంద్‌రెడ్డి



మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 08 ప్రభాతవార్త: మహబూబ్‌నగర్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా చల్లా వంశీచంద్‌రెడ్డిని ఖారారు చేస్తూ కాంగ్రెస్ అధిష్టాన్ నిర్ణయించింది. ఈమేరకు ఏఐసీసీ కార్యాలయం నుంచి అభ్యర్థుల జాబితాను విడుదల చేశారు. ఇటీవల కోస్గిలో నిర్వహించిన బహిరంగ సభలో చల్లా వంశీచంద్‌రెడ్డి పేరును సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే కాంగ్రెస్ పార్టీ అధిష్టానం అధికారికంగా శుక్రవారం జాబితాను విడుదల చేసింది. మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలోని 7అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలే ఉండడంతో వంశీచంద్‌రెడ్డి గెలుపు ఖాయమే అంటున్నారు పార్టీ శ్రేణులు. అయితే ఇప్పటికే పాలమూరు న్యాయ యాత్ర పేరుతో 7అసెంబ్లీలో పాదయాత్రం నిర్వహించి గత బీఆర్ఎస్ ప్రభుత్వ అవినీతి అరాచక పాలనను పాలమూరుకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తూ ముందకుసాగారు. మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన ముగింపు సభకు సీఎం రేవంత్ రెడ్డి హాజరై కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపారు. కాంగ్రెస్ అధిష్టానం చల్లా వంశీచంద్‌రెడ్డి పేరును అధికారికంగా ప్రకటించడంతో పార్టీలు శ్రేణులు, అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

# భక్తులతో కిటకిటలాడిన శైవక్షేత్రాలు

- శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు
- శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించిన రాజకీయ ప్రముఖులు





**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 08 ప్రభాతవార్త:** జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే పుణ్య స్నానాలు ఆచరించి ఆలయాలకు భక్తులు బారులుతీరారు. ఎంపీ సభ్యుడు మన్నె శ్రీనివాస్‌రెడ్డి శివరాత్రి సందర్భంగా ప్రసిద్ధి చెందిన వీరన్నపేటలోని పెద్ద శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన భక్తులకు ప్రసాద వితరణ చేశారు. అదేవిధంగా బీజేపీ రాష్ట్ర కోశాధికారి బండారి శాంతికుమార్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరుమలహిల్స్‌లోని అప్పన్నపల్లి త్రినేత్ర దశభుజ వీరాంజనేయ స్వామి ఆలయంలో బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు జితేందర్‌రెడ్డి పూజలు నిర్వహించారు.

**ఏనుగొండలో:** మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఏనుగొండ సాంబ శివాలయంలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో నిర్వహించిన మహా శివరాత్రి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. మాజీ మంత్రి వెంట డిసిసిబి వైస్ ఛైర్మన్ కె. వెంకటయ్య, మున్సిపల్ మాజీ వైస్‌ఛైర్మన్ గణేష్, సీనియర్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, పర్వతాలు, నవకాంత్, సాంబ, నరెందర్, నర్సి రెడ్డి, కిష్టయ్య ఉన్నారు. జడ్చర్ల మండల పరిధిలోని కోడుగల్‌లోని ఆలయం లో జరిగిన ప్రత్యేక పూజల్లో జడ్పీ వైస్ ఛైర్మన్ కోడుగల్ యాదయ్య పాల్గొన్నారు.

**మీనాంబరంలో డీకే అరుణ పూజలు:** జడ్చర్ల మండల పరిధిలోని మీనాంబరం వద్ద అతి పురాతన శివాల యంలో బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని వేడుకొన్నారు. పూజల్లో బీజేపీ క్రమ శిక్షణ కమిటీ సభ్యురాలు పద్మజారెడ్డి, బీజేపీ మహిళా మోర్చా జాతీయ ఉపాధ్యక్షురాలు సాహితీరెడ్డి, బీజేపీ జడ్చర్ల పట్టణాధ్యక్షుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



